మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL / 25 / A4284




రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 70 | 04 బుధవారం, ఫిబ్రవరి 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ట, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

02

## తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

● కేబినేట్‌కు ముందు ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు భేటీ

## బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

● వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

● అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



02



02

ట్రంప్ ఒత్తడికి

## ప్రధాని తలొగ్గారు

● మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు

● ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది

● అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ● ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్

గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.



## అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయండి: బండి




కరీంనగర్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్

మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు కష్టపడి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.'నేను కేసీఆర్‌ని గజగజ వణికించా. నా తలకాయను కేసీఆర్.. ఆరు ముక్కలు చేస్తానని గతంలో అన్నారు. ఆయన సంగతి తేల్చేందుకు ఫామ్‌హౌస్‌కు వస్తానని చెప్పా. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను బజార్‌కు లాక్కొచ్చా. కేసీఆర్ మెడలు వంచింది నేనే. నేను ఎవరికీ భయపడను. గడీల నుంచి కేసీఆర్‌ను నేనే బయటకు తీసుకువచ్చా' అని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

● ఉచితాలను ప్రకటించడానికి కాదు

● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్

ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు.

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

● నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

● తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

● ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాట మార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచు కుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మేడారం జాతర విజయవంతం

● ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం

● ఎక్కడా అవాంఛనీయ

● ఘటనలు లేకుండా జాతర పూర్తి

● మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క



02

## తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

202 మరణాలతో తెలంగాణ రెండో స్థానం

దేశ వ్యాప్తంగా మొత్తం 1,075 మంది మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్

టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది.

మిగతా 2లో

## అమెరికాతో ట్రేడ్ డీల్‌తో ఉజ్వల భవిష్యత్

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3నేషనలిస్ట్ వాయిస్



అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకొచ్చారని, ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు చెబుతోందన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా.. పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించాను. కానీ.. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ గందరగోళ పరిస్థితులను సృష్టించింది. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన యత్నిస్తుండటం విచారకరం.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు నో అబ్జెక్షన్: సుప్రీం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3నేషనలిస్ట్ వాయిస్

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## మన సహనమే విజయానికి బాట



● విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

● అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది

● అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ ● ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

02

# ఇస్నాపూర్ మున్సిపాలిటీ 12, 14 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచార ఉత్సవం

12వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం శ్రీశైలం

14వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం బాలమణి శ్రీశైలం

**పటాన్చెరు/ నేషనలిస్ట్ వాయిస్**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ 12వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం శ్రీశైలం, 14వ వార్డు అభ్యర్థి గడ్డం బాలమణి కలిసి విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.వార్డు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలు వివరించారు. ప్రజలు అపార ఆదరణ చూపారు. పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలిపారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువకులు, ప్రముఖ నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో ప్రచారం ఘనవిజయం సాధించింది.గడ్డం శ్రీశైలం - 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం బాలమణి - 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థికాంగ్రెస్ చేతిగుర్తుపై ఓటు వేసి గెలిపించండి. 30 ఏళ్లుగా ప్రజాసేవలు చేస్తున్న శ్రీశైలం అన్న, ప్రజామద్దతుతో ముందుకు సాగుతున్న బాలమణిని ఆశీర్వదించండి.







# గంగమ్మ గుడి మండప నిర్మాణానికి సమావేశం

**నేషనలిస్ట్ వాయిస్వలిగొండ మండలం ఫిబ్రవరి 03**

వేములకొండ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులందరూ కలిసి వేములకొండ గంగమ్మ గుడి వద్ద మండపం నిర్మాణం చేయుటకు సభ్యులు అందరూ కలిసి చర్చించడం జరిగినది. ఇందులో పాల్గొన్న సభ్యులు అంబటి యాదగిరి మాజీ ఆర్ ఐ, అంబటి అంజయ్య అధ్యక్షుడు మాజీ సెక్రెటరీ ఏరువ సత్యనారాయణ, పూస నరసింహ, అంబటి సత్తయ్య, అంబటి ముత్తయ్య, పూస సత్యనారాయణ, పూస రవి, దీటి రామయ్య, పూస యాదగిరి, అంబటి సాయికుమార్ ఉప సర్పంచ్ వేములకొండ, పాల్గొన్నారు.



# గ్రామాల్లో పులి సంచరిస్తున్న ప్రదేశాలలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు

**నేషనలిస్ట్ వాయిస్ యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 03**

జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.మంగళవారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల గ్రామాలలో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాల పై అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్ ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం , ట్రాప్ కెమెరా, పులిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అటవీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు.రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు.



మొదటిపేజీ తరువాయి

# మన సహనమే విజయానికి బాట

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

మొదటిపేజీ తరువాయి

# మేడారం జాతర విజయవంతం

**హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

**అమరావతి,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

మొదటిపేజీ తరువాయి

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆర్ఎస్ బిజెపిల వ్లల ఒరిగేదేమీ లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

# ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

**హైదరాబాద్,ఫిబ్రవరి 3నేషనలిస్ట్ వాయిస్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి.. ఆదాయం : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులు అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని సాధించవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, భవిష్యత్‌లో వచ్చే ఆదాయం, తదితర అంశాలపై వివరించారు. మెగా ప్లాంటేషన్ లో భాగంగా ఈరోజు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో కలిపి మొత్తం 32 మంది రైతుల ద్వారా 110 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుని, ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. ఆయిల్ పామ్ పంట సాగు ఆవశ్యకతను, అధిక దిగుబడి, లాభాలను తెలుసుకుని ఆసక్తితో ముందుకు వచ్చిన రైతులను ఇంచార్జి కలెక్టర్ అభినందించారు. ఆయిల్ పామ్ సాగుకు ఇక్కడి రైతులు తీసుకున్న నిర్ణయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, మీ అనుభవాలను పక్క గ్రామాల రైతులతో పంచుకుని ఆయిల్ పామ్ పంట సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తితో ముందుకు రావాలని, ఈ పంట అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటుదని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి, ఆదాయం వస్తుందని వెల్లడించారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు పీఏసీఎస్ లకు, ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఏఓలకు, ఏఈవోలకు లక్ష్యం కేటాయించామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆద్వర్యంలో జిల్లా కేంద్రం, వివిధ ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుతో లాభాలు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు వివరిస్తూ.. కరపత్రాలు సిద్ధం చేసి పంపిణీ చేయించామని, బోయినపల్లి మండలంలో ఇప్పటికే సాగు చేసిన రైతులతో సమావేశాల్లో మాట్లాడించి.. అవగాహన కల్పించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటకు మన జిల్లా నుంచి గత నెల 19న ఆయిల్ పామ్ సాగు, ఫ్యాక్టరీ సందర్శనకు సుమారు 50 మంది రైతులను పంపించామని, సందర్శన



అనంతరం ఆ రైతులు సాగుపై సంతృప్తి వ్యక్తం చేయడం తోపాటు ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం జూలై నుంచి ఇప్పటి దాకా 67 మంది రైతుల నుంచి 257 ఎకరాల్లో 110 టన్నులు ఆయిల్ పామ్ పంటను సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో టన్నుకు రూ.20,456 మద్దతు ధర ప్రస్తుతం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఎక్కువ మంది కూలీలు అవసరం లేదని, నిర్వహణ ఖర్చు తక్కువ ఉంటుందని తెలిపారు. పంట విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉందని వెల్లడించారు. మిగితా అన్ని పంటలతో పోలిస్తే దీని సాగుతో ఎన్నో లాబాలు ఉన్నాయని, అటవీ జంతువుల బాధ ఉండదని, పర్యావరణ సమస్యలతో ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. అంతర పంటలుగా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వల్లంపట్ల గ్రామంలో 2022 సంవత్సరంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి పంటను సాగు చేస్తున్న తీరును ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతును అడిగి సాగు వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ ఫారూక్, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

# సూక్ష్మ పరిశీలకులు విధులపై పూర్తి అవగాహనతో పనిచేయాలి

## లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న సూచన

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 03.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందున తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారు మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన నియమాలు, పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షణ విధానం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియలో జాగ్రత్తలు వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి ప్రక్రియను నిశితంగా గమనిస్తూ, ఏవైనా అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల స్వచ్ఛతను కాపాడటంలో తమ వంతు బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 03.

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, అన్ని ప్రభుత్వ బడుల్లో ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల వంద శాతం హాజరు ఉండాలని అన్నారు. తరచూ బడికి రాని పిల్లల ఇండ్లకు వెళ్లి, వారి పోషకులతో మాట్లాడి తరగతులకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పోషకులతో సమావేశం నిర్వహిస్తూ, వారి పిల్లల ప్రతిభకు సంబంధించి వివరాలను వారితో పంచుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ, చదువులో వెనకబడిన పిల్లలు ముందుకు వెళ్లాలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఏ విద్యార్థి, ఏ సబ్జెక్టులో వెనకబడ్డారో తెలుసుకొని, వారి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని వివరించారు. పరీక్షల ఫలితాలు, హాజరు శాతం వివరాలు విద్యార్థుల ఫలితాలు, హాజరు శాతం తమకు అందజేస్తూ ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఎక్కువ మార్కులు వచ్చే ముఖ్యమైన పాఠాలు ఎక్కువగా చదివిపించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ, పరీక్షలపై భయం, ఒత్తిడి దూరం చేస్తూ వారిని ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ భోజన్న, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# నిరాడంబర వివాహాలు- ముఖాముఖి.. సామాజిక సంస్కరణకు ప్రేరణ

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిర్మల్ ఫిబ్రవరి 03.

ముస్లిం కుటుంబ జీవితంలో సరళత, బరకత్‌ను పునరుద్ధరించాలనే ఉద్దేశంతో, జమీయతుల్ ఉలమా జిల్లా నిర్మల్ సామాజిక సంస్కరణ విభాగం ఆధ్వర్యంలో "ఈజీ మ్యారేజెస్ ఫేస్ టు ఫేస్" అనే శీర్షికతో నగర స్థాయి మహాసదస్సు ఘనంగా నిర్వహించబడింది. నిర్మల్ నగరంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖ ఇస్లామీయ పండితులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు హాజరయ్యారు.

ఈ సభను ఉద్దేశించి మాట్లాడిన జమీయతుల్ ఉలమా తెలంగాణ ఉపాధ్యక్షులు హజ్రత్ మౌలానా మహమ్మద్ ముసద్దిక్ ఖాసిమీ గారు, వివాహానికి సంబంధించిన ప్రస్తుత సామాజిక ఆచారాలను పునఃపరిశీలించాల్సిన అత్యవసరత ఉందని తెలిపారు. ఇస్లాం నికాహ్‌ను సులభంగా, గౌరవప్రదంగా నిర్దేశించినప్పటికీ, ముస్లిం సమాజం అనవసర ఆచారాలు, ఖర్చులతో దానిని భారంగా మార్చుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన వారు హదీస్ మరియు ఫిఖ్ ప్రముఖ పండితులు, దారుల్ ఉలూమ్ హైదరాబాద్ ఉపాధ్యాయులు మరియు జమీయతుల్ ఉలమా తెలంగాణ సామాజిక సంస్కరణ విభాగం నాజిమ్ అయిన హజ్రత్ మౌలానా ముఫ్తీ మహమ్మద్ తజమ్ముల్ హుస్సేన్ ఖాసిమీ ఆయన తన హృదయాన్ని హత్తుకునే అధ్యక్ష ప్రసంగంలో, సామాజిక దురాచారాల నిర్మూలన మరియు సమాజ సంస్కరణ ఈ కాలంలో అత్యంత కీలక బాధ్యత అని, అది సమిష్టి మరియు నిరంతర ప్రయత్నంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.సున్నత్ ఆధారిత నికాహ్‌లు మరియు వలీమాలను అవలంబించాలని, ఆడంబరం, అనవసర ఆచారాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని ఆయన సమాజానికి పిలుపునిచ్చారు. అల్లాహ్‌కు విధేయతతో, సరళతతో ప్రారంభమయ్యే దాంపత్య జీవితం శాంతి మరియు శాశ్వత బరకత్‌కు మూలమవుతుందని గుర్తు చేశారు.ప్రవక్త ముహమ్మద్ నీ హదీస్‌ను ఉటంకిస్తూ "అత్యంత బరకత్ కలిగిన నికాహ్ తక్కువ ఖర్చుతో జరిగేదే"అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అత్యంత హృదయస్పర్శక ఘట్టంగా, సున్నత్ పద్ధతిలో రెండు నికాహ్‌లు నిర్వహించబడటం జరిగింది. ఇది సదస్సు సందేశాన్ని ఆచరణాత్మకంగా చూపిన గొప్ప ఉదాహరణగా నిలిచింది.ఇంకా జామియా అరబియా దారుల్ ఉలూమ్ భైంసా నాజిమ్ మరియు స్థానిక సామాజిక సంస్కరణ విభాగం నాజిమ్ అయిన హజ్రత్ మౌలానా షాహిద్ ఘుఫ్రాన్ ఖాసిమీ ప్రసంగిస్తూ, సమాజంలో శాశ్వత మార్పు కోసం పునాది స్థాయి ప్రయత్నాల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఉలమా మరియు నాయకులలో మౌలానా మహమ్మద్ షాహిద్ అలీ మజాహిరీ, మౌలానా అబ్దుల్ ఆలీం ఖాసిమీ, ముఫ్తీ ఖ్వాజా ముదస్సిర్ అలీ ఖాసిమీ, ముఫ్తీ మహమ్మద్ నౌమాన్ నజీబ్ ఖాసిమీ, మౌలానా సయ్యద్ ఆబిద్ హుస్సేన్ ఖాసిమీ, మౌలానా




అక్దస్ హసమీ, ఖారీ సయ్యద్ సలీం ఖాసిమీ, మౌలానా ఆమిర్ హసమీ, హాఫిజ్ ముజక్కిర్ అలీ, హాఫిజ్ మక్సూద్, మౌలానా సల్మాన్ ఖాసిమీ, హాఫిజ్ చంద్, హాఫిజ్ జునైద్, హాఫిజ్ అజీజ్, హాఫిజ్ ఫైసల్, హాఫిజ్ జావేద్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ యజమాని ఇజాజ్ అలీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయబడ్డాయి. ఆయన ఈ కార్యక్రమానికి వేదికను పూర్తిగా ఉచితంగా అందించడం గొప్ప సేవగా అభినందించబడింది. జమీయతుల్ ఉలమా అధికారులు ఆయనను శాల్వాతో సత్కరించారు.ఇకపై కూడా జమీయతుల్ ఉలమా నిర్మల్ ఆధ్వర్యంలో జరిగే సామాజిక సంస్కరణ కార్యక్రమాలు మరియు "ఈజీ మ్యారేజెస్ ఫేస్ టు ఫేస్" కార్యక్రమాలకు తన హాల్‌ను ఉచితంగా అందిస్తానని ఇజాజ్ అలీ ప్రకటించడం హృదయాన్ని హత్తుకుంది. అలాగే వచ్చిన ఉలమాలను కూడా ఆయన శాల్వాలతో సత్కరించారు.ఈ సదస్సు, సమాజంలో వివాహాలపై ఉన్న దృక్పథాన్ని మార్చడంలో, యువతకు వివాహ మార్గాన్ని సులభతరం చేయడంలో, అలాగే ఇస్లామీయ సరళత, గౌరవం, కరుణ వంటి విలువలను పునరుజ్జీవింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావంతో ముగిసింది.

# జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ.

## - జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టు రవి

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :

అదిలాబాద్ జిల్లా జానపద కళాకారులకు తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మిట్టు రవి మంగళవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్ యందు మీడియాకు తెలియజేశారు.ఈ సందర్భంగా మిట్టు రవి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గుస్సాడి,థింసా,కోయ, మథుర,డప్పు,తబల, హార్మోనియం,డోలు,కిక్రి, పన్నెండు మెట్ల కిన్నెర,బుర్ర కథ,భజన,సంగీత వాయిద్య కళాకారులకి,జానపద గాయకులు,జానపద నృత్య కళాకారులు,కవులు,రచయితలు సంఘంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి కష్ట కాలంలో అనుకోకుండా ప్రమాదం జరిగినట్లయితే నార్మల్ గా మరణించిన సంఘం సంక్షేమ నిధి ద్వారా 5 నుండి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు.కావున ఇంకా ఎవరైతే తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘంలో గుర్తింపు కార్డు కోసం ఆధార్ కార్డు జిరాక్స్,రేషన్ కార్డు మరియు రెండు పాస్ ఫోటోలు ఈ చరవాణి 9703686368 కి సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధ్యక్షులు మిట్టు రవి తెలిపారు. మీడియా సమావేశం మావల మండల అధ్యక్షులు రాజేశ్వర్,సంఘం బాధ్యులు పసుల లింగన్న,నారాయణ,జగన్నాథ ఋషి గాజుల పాల్గొన్నారు.




# మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో మంగళవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును, లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో రూ. 1000 వేద ఆశీర్వచనం, రూ.500 స్పెషల్ కోడె, రూ. 300 స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

### భీమేశ్వర ఆలయంలో పూజలు

అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో శ్రీమతి ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఎపిలో కల్తీ నెయ్యి మంటలు !

తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్దోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయారయ్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్చకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగిపోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలో నిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెరియిన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

## క్యాన్సర్ అంతానికి అవగాహనే కీలకం

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**

క్యాన్సర్‌ను అంతం చేయడానికి అవగాహననే కీలకమని, ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే జీవన ఆశలు పెరుగుతాయని లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవంను పురస్కరించుకొని సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఏ, ఎన్ఏఎల్ఎస్ పథకాల ద్వారా ఉచిత న్యాయ సహాయం, చికిత్స సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు డా.సాహితీ చింత, న్యాయవాదులు ఆడెపు వేణు, బి.వాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించి, ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే పట్టణంలోని సీఎన్ఆర్ కళామందిరంలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ మేనేజర్ సంపత్ పాల్గొన్నారు.



## చదువును ఆయుధంగా మల్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### విద్యార్థి దశలో కష్టపడితే... జీవితమంతా సుఖ సంతోషాలే

### బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 03 :**

విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్దులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు.

వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. పది పరీక్షల్లో ప్రతిభను చాటితే బిగ్ స్క్రీన్ పై టి.20 వరల్డ్ కప్ లైవ్ మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేయిస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా కాకుండా విద్యార్థులకు పునఃశ్చరణ జరిపించాలని ఉపాధ్యాయులకు, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా అనువైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న, వసతి గృహాల నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### పీ.ఓల శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్, అబ్జర్వర్



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 03 :**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్, ఎన్నికల పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణ రెడ్డి సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, ముందుగానే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఆర్మూర్ లోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణ విధులపై మాస్టర్ ట్రైనర్ చే మంగళవారం అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులను సందర్శించిన సందర్భంగా అదనపు కలెక్టర్, అబ్జర్వర్లు పీ.ఓ, ఏ.పీ.ఓలకు కీలక సూచనలు చేశారు. హ్యాండ్ బుక్ లో పొందుపర్చిన అంశాలను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధులపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని అన్నారు. పి.ఓలు చేపట్టాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి క్లుప్తంగా వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని, తప్పులు జరిగితే క్రమ శిక్షణ చర్యలకు గురి కావాల్సి ఉంటుందని అన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉంటేనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించాలని సూచించారు. సమయ పాలన పక్కాగా పాటించాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ మెటీరియల్ తీసుకునే సమయంలో జాగ్రత్తగా పరిశీలించుకోవాలని అన్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద బి.ఎల్.ఓ సహాయక కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు స్లిప్ ఐడి కాదని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 18 రకాల ఐడి కార్డులలో ఏదైనా ఒక దానిని ఓటరు తీసుకురావచ్చని తెలిపారు. ఈ విషయమై విస్తృత స్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. రిపోలింగ్ కు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సజావుగా పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు పూర్తయ్యేలా జాగ్రత్తగా ఎన్నికలు జరపాలని సూచించారు. శిక్షణ తరగతులలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, పీ.ఓలు, ఏ.పీ.ఓలు, స్థానిక అధికారులు పాల్గొన్నారు. అనంతరం పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ లను ఎన్నికల పరిశీలకులు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# డ్రైవర్లు వాహన నియమ నిబంధనలు పాటించాలి.

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## అరైవ్ అలైవ్" లో భాగంగా ఆటో,టాక్సీ డ్రైవర్ లకు ఉచిత కంటి అద్దాలు అందజేత

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :**

"అరైవ్ అలైవ్" లో భాగంగా గత నెల 21నుండి సాగుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష నిర్వహించారు.ఇందులో భాగంగా కంటి సమస్యలు ఉన్న ఆటో,టాక్సీ వాహన డ్రైవర్లకు మంగళవారం రోజు పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ 84 వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ఆటో డ్రైవర్లు వాహన నియమనిబంధనలు పాటించాలని,ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.మంచి కంటి చూపు ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని,జిల్లా పోలీసు శాఖ తరపున మరియు పట్టణంలోని ప్రైవేటు కార్తీక్ ఆప్టికల్స్ యజమాని పోలసాని హనుమాన్లు యాదవ్ సహకారంతో ఉచితంగా కంటి అద్దాలను డ్రైవర్లకు అందజేయడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని,ప్రయాణికుల ప్రాణాలు మీ చేతిలో ఉంటాయని వాటిని దృష్టిలో పెట్టుకొని,ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రాణానష్టాన్ని తగ్గించాలని సూచించారు.వాహనాలు,ఆటోలు,టాక్సీలు రాంగ్ సైడ్ ప్రయాణించడం వల్ల ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాంగ్ సైడ్ ప్రయాణాన్ని మానుకోవాలని సూచించారు.ముఖ్యంగా జాతీయ రహదారులపై సైన్ బోర్డులు,వేగ నియంత్రణ బోర్డులు ఉన్న సందర్భంలో వాహన వేగాన్ని తగ్గించాలని,అతివేగం ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు.పట్టణంలోని ఆటోలు అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకున్న సందర్భంలో వారి పై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,పట్టణ సిఐలు బి సునీల్ కుమార్,కె నాగరాజు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ డెలివరీ గడువులోపు సంపూర్తి చేయాలి: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**

సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 202425 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 16-02-2026 చివరి తేదీ అని, రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 28-02-2026 చివరి తేదీ అని వెల్లడించారు. జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం మిల్లర్లు బాధ్యతగా భావించాలని సూచించారు. గత అనుభాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్ లో లక్ష్యాన్ని సమర్ధవంతంగా చేరుకునేలా ముందుచూపుతో వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాబాయి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు జాబితాను అందచేసిన ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పురపాలక పరిధిలోని 49 వార్డులకు కౌన్సిలర్ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఫైనల్ చేసింది.ఆయా వార్డులలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితాను మున్సిపల్ ఎన్నికల పార్లమెంట్ ఇంచార్జి సుదర్శన్ రెడ్డి,జిల్లా పరిశీలకులు,ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తో కలిసి ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డికి అందించారు.అనంతరం కాంగ్రెస్ అభ్యర్థుల బీం ఫాం జాబితాను ఎన్నికల అధికారికి అందించారు.



# గుర్తుల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి.- జిల్లా కలెక్టర్ రాజార్షి షా

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక టీటీడీసీలో రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి నామినేషన్ల ఉపసంహరణ,బి-ఫారాల పరిశీలన,గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నామినేషన్ల ఉపసంహరణ సమయంలో అనుసరించాల్సిన విధానం,రాజకీయ పార్టీలు సమర్పించే బి-ఫారాల పరిశీలనలో తనిఖీ చేయాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం వార్డుల వారీగా అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు.ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల నియమావళి మేరకు పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్,మున్సిపల్ కమిషనర్ రాజు,నోడల్ అధికారి ఫణీందర్,మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్,రిటర్నింగ్ అధికారులు,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఫెర్టిలైజర్ యాప్ కు స్పందన..

## జిల్లావ్యాప్తంగా 13,381 బస్తాల ఎరువుల బుకింగ్

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లిఫెర్టిలైజర్ యాప్‌లి ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు చేస్తున్నారని మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని రైతులు యాప్ ద్వారా 13,381 ఎరువుల బస్తాలు బుకింగ్ చేశారని, 9,436 బస్తాలు కొనుగోలు చేశారని వెల్లడించారు. అన్ని చోట్లా రైతులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్, ఒక సహాయకుడు ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ యాప్ లో యూరియా బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు.



# జలాల్పూర్ గ్రామాన్ని సందర్శించిన కేంద్ర ఆడిట్ బృందం

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం జలాల్పూర్ గ్రామాన్ని మంగళవారం కేంద్ర ఆడిట్ బృందం సందర్శించింది. గత సర్పంచ్ హాయంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను పరిశీలించింది. సీసీ రోడ్లు, మురికి కాలువలు, డంపింగ్ యార్డ్, తాగునీటి పనులు, పారిశుద్ధ పనుల తనిఖీ జరిపింది. వారి వెంట సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి, ఎంపీఓ గంగామోహన్, కారోబార్ వేణు పాల్గొన్నారు,



# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,.సీ.పీ

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 03 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరు కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని సీ.ఎం సభా స్థలిగా ఖరారు చేసిన నేపథ్యంలో కలెక్టర్ , సీ.పీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, వేదిక తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ సర్దార్ సింగ్, ట్రాన్స్కో ఎస్.ఈ రాజేశ్వర్, ఆర్టీసీ ఆర్.ఎం జ్యోత్స్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ తదితరులు ఉన్నారు.



# దేశ ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర్'

## అమెరికా ట్రేడ్ డీల్‌పై టిడిపి ఎంపి సానా సతీశ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

అమెరికా పన్నుల తగ్గింపు దేశ ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర్' అని టీడీపీ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మరో చరిత్రాత్మక ఆర్థిక విజయాన్ని సాధించిందని అన్నారు. భారత్- అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వానికి మరో నిదర్శనంగా నిలిచిందన్నారు. ఆసియా దేశాల్లోనే భారత్‌కు అత్యల్ప పన్ను శాతం వర్తించడం విశేషమన్నారు. దీని వల్ల 'ఓజీటఙ తిని ఎనిటతిజీ' ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఎంపీ వివరించారు. నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా తీరప్రాంతాలకు భారీ లాభాలు చేకూరుస్తుందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. కాకినాడ నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా, సముద్ర ఆహార ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు మరింత సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీని ద్వారా వేలాది మంది మత్స్యకారులు, రొయ్యల రైతులు, ఎగుమతిదారులకు ఆర్థిక భద్రతతో పాటు కొత్త ఆశలు కలుగుతాయని అన్నారు.

# ఎన్నికల ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**



మున్సిపల్ ఎన్నికలను నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల వ్యయాలపై పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టాలని వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ ఆదేశించారు.మంగళవారం ఆయన సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలను సందర్శించి, ఎన్నికల అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాల నమోదు, లెక్కల నిర్వహణ, రోజువారీ వ్యయ నివేదికల సమర్పణ విధానం వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, వ్యయ రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్ చేయాలని సూచించారు. ప్రచార కార్యక్రమాలు, వాహనాల వినియోగం, ప్రచార సామగ్రి, సభలు, సమావేశాలు తదితర ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ సమన్వయంతో పనిచేసి అక్రమ ఖర్చులు, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని తెలిపారు.అభ్యర్థులకు ఎన్నికల వ్యయాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, వారు సమయానికి ఖర్చుల వివరాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి పాల్గొన్నారు.

# ఇసుక టిప్పర్ పట్టివేత....

## కేసు నమోదు చేసిన ఎస్ఐ యస్ యం. నవీద్....

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**




మండలంలోని హిందూపూర్ చౌరస్తాలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో రాయచూరు నుండి ఒక టిప్పర్ టియస్ 12 యుఇ 4281 అనుమానస్పదంగా వస్తుండగా దాన్ని ఆపి చెక్ చేయగా దాన్ని నిండా ఇసుక ఉండగా అనుమతులు చూపించాలని పోలీసులు అడగగా ఇట్టి ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా మాన్వి నుండి బీదర్కు టిప్పర్ ఓనర్ నాగనాథ్ ఆదేశాల మేరకు తరలిస్తున్నానని టిప్పర్ డ్రైవర్ మహేష్ సన్నాఫ్ కాంతప్ప వయసు 24 సంవత్సరాలు తెలుపగా ఇట్టి టిప్పర్ను స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ ఎస్సై మంగళవారం తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పకడ్బందీగా నిర్వహించాలి

**నేషనలిస్ట్ వాయిస్‌జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3**

రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపీఎస్..రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి, ఐపీఎస్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు మరియు ఇతర పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసమావేశంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు, పోలింగ్ మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల చట్టాలు మరియు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులు, ఎన్నికల వేళ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు మరియు అనుమానితులను బైండోవర్ చేయాలని సూచించారు.రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు పోలీసు అధికారులకు మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఎన్నికల సమయంలో చట్టాల అమలు,నిబంధనల పాటింపు ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలను వివరంగా వివరిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో తీసుకుంటున్న చర్యల వివరాలను డీజీపీ గారికి తెలియజేశారు.ఈసమీక్షా సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు కిరణ్, రామ్మోహన్, వినితా రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బి ఆర్ ఎస్ పార్టీ కి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా

**నేషనలిస్ట్ వాయిస్‌జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3**



సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బండారి శ్యాం బిఆర్ఎస్ పార్టీకీ రాజీనామా చేశారు.సిరిసిల్ల మున్సిపల్ పదవ వార్డుకు బిఆర్ఎస్ టికెట్ ఆశించిన నాకు పార్టీలోని దడిదల శ్రావణ్ రావు తో పాటు మరికొంతమంది కలిసి టికెట్ ఇవ్వకుండా చేశారని ఆయన ఆరోపించారు. 17 ఏళ్ల పాటు బి.ఆర్.ఎస్ పార్టీ కోసం ఎల్లప్పుడూ నమ్మకంగా పని చేశానని, నమ్మక ద్రోహం చేశారంటూ శ్యాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆలోచించి కార్యకర్తలు నాలాంటి నాయకులు పార్టీలో నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలంటే బి ఆర్ ఎస్ పార్టీలో నమ్మకద్రోహం చేస్తున్న కొంతమంది నాయక ముఠాను పక్కకు పెట్టాలని లేనట్లయితే పార్టీ మనుగడ కష్టమని ఆయన పేర్కొన్నారు.

# దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్ శ్రీనివాస్ ప్రభుత్వ వైద్యురాలు వాహిని

**నేషనలిస్ట్ వాయిస్ మల్లాపూర్ ఫిబ్రవరి 03**

వార్తా పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలాగ పని చేస్తాయని మండల తహసీల్ధార్ శ్రీనివాస్ అన్నారు. ఆయన మండల కేంద్రంలోని తహసీల్ధార్ కార్యాలయంలో దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించి అభినంధనలు తెలియజేసారు. మండల ప్రభుత్వ వైద్యురాలు వాహిని మాట్లాడుతూ తన ద్వారనేషనలిస్ట్ వాయిస్ క్యాలెండర్ ఆవిష్కరించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

ఇట్టి కార్యక్రమంలో తహసీల్ధార్ శ్రీనివాస్ , ప్రభుత్వ వైద్యురాలు వాహిని, సూపర్ వైజర్ రాంమోహన్ ,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ , నర్సింగ్ ఆఫీసర్ ఉమాదేవి, వార్త దినపత్రిక ప్రతినిధి రాంప్రసాద్ , నేటి ధాత్రి దినపత్రిక ప్రతినిధి ఎస్ పి రమణ, అక్షర వేధం దిన పత్రిక ప్రతినిధి జరుపుల రమేష్ , కాంగ్రెస్ నాయకులు గంధం రాజేష్ ,నేషనలిస్ట్ వాయిస్ దినపత్రిక ప్రతినిధి వంగ రాజశేఖర్ పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత

### - తలాపునే గోదావరి ఉన్నా దొరకని ఇసుక - ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

### - ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకోలు

**పినపాక ప్రతినిది, ఫిబ్రవరి 3 నేషనలిస్ట్ వాయిస్**

తలాపునే గోదావరి ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులను ఇసుక కొరత వేధిస్తోంది. ప్రధానంగా అమ్మగారిపల్లి, అమెర్ధ, చింతిర్యాల, ఆనందపురం, నెల్లిపాక, బట్టీలగుంపు ఈ ఆరు పంచాయతీలు గోదావరి నదికి పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామపంచాయతీలు. అయితే ఈ గ్రామ పంచాయతీలకు కూడా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తీవ్రంగా వేధిస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కూతవేటు దూరంలోనే గోదావరి అందులో ఉండి పుష్కలంగా ఇసుక నిల్వలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునేందుకు ఇసుక తెచ్చుకోవాలంటే అనేక అడ్డంకులు తలెత్తుతున్నాయని ఇందిరమ్మ ఇల్లు పొందిన లబ్ధిదారులు చెప్తున్నారు. మండలంలో భట్టిలగుంపు పంచాయితీలోనే ప్రభుత్వ అనుమతి పొందిన సొసైటీలకు ఇసుక క్వారీ ఉంది. ఈ క్వారీ నుండి ఇసుక తెచ్చుకున్న కేవలం అమ్మగారిపల్లి అనుకూలంగా ఉంటుంది తప్ప ఇతర పంచాయతీలకు ఇక్కడి నుండి ఇసుక వెళ్లాలంటే అధిక మొత్తంలో ఖర్చువుతుంది అని లబ్ధిదారులు అంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఓ పక్కన ఇందిరమ్మ గృహాలు నిర్మాణం చేపట్టుకునే వారికి ఇసుక ఉచితంగా ఇస్తామని చెబుతున్నప్పటికీ సొసైటీ ద్వారా పొందిన క్వారీల నుండి తెచ్చుకోవాలంటే ట్రాక్టర్ కిరాయిలు అధికమవుతున్నాయని తద్వారా నిర్మాణాలకు అధిక భారం అవుతుందంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గోదావరి పరివాహక ప్రాంతాల నుండి స్థానిక తహసిల్దార్ల ద్వారా అనుమతి తీసుకుని ఇసుక తెచ్చుకునేలా చర్యలు చేపట్టాలని ఇందిరమ్మ లబ్ధిదారులు కోరుతున్నారు.

**గోదావరి నుండి ఇసుక తెచ్చుకునేలా అధికారులు అనుమతులు ఇవ్వాలి :** ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు చేపట్టుకుంటున్న లబ్ధిదారులకు గోదావరిలో అనుకూలంగా ఉన్న ర్యాంపుల నుండి స్థానిక రెవెన్యూ అధికారుల అనుమతితో ఇసుక తెచ్చుకునేలా జిల్లా ఉన్నతాధికారులు అనుమతించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. తద్వారా ట్రాక్టర్ ఇసుకకు బాడుగలు తగ్గడంతో పాటు ఇసుక ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు త్వరితన పూర్తి అవుతాయని పలువురు అంటున్నారు. జిల్లా కలెక్టర్ ఇసుక లేక ఇబ్బంది పడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణాల పట్ల ప్రత్యేక శ్రద్ధ అలాగే లబ్ధిదారులు పడుతున్న బాధలను గమనంలోకి తీసుకొని మండలంలోని సంబంధిత శాఖల అధికారుల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైనన్నీ యూనిట్ల ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని నిరుపేద లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

**ఇసుక లేక నిలిచిపోయిన స్లాబ్ : దామర్ల సంధ్య** ఇందిరమ్మ లబ్ధిదారు మాకు ఇందిరమ్మ గృహం మంజూరు అయింది. ఇప్పటివరకు స్లాబ్ లెవల్ కట్టుకున్నాము. చింతిర్యాల గోదావరి నుండి ఇసుక రాకపోవడంతో స్లాబ్ చేయలేక పోతున్నాము. స్థానిక గోదావరి నుండి ఇసుక తెచ్చుకునేలా అధికారులు అనుమతి ఇవ్వాలి.

**ఇసుక లేక నిర్మాణం ఆగిపోయింది : మానేపల్లి పద్మ** చింతిర్యాల గోదావరి నుండి ఇసుక ఆగిపోవడంతో మా ఇల్లు పునాదిలోనే ఆగిపోయింది. అనుమతి ఉన్న ఇసుక క్వారీ నుండి ఇసుక తెచ్చుకోలేకపోతున్నాము. అక్కడినుండి ఇసుక తేవాలంటే కిరాయికే వేలల్లో ఖర్చు అవుతుంది. అధికారులు స్పందించి చింతిర్యాల గోదావరి నుండి ఇసుక తెచ్చుకునేలా అనుమతి ఇవ్వాలి.







# రాజ్యాధికార పార్టీ మహిళా కమిటీ ఎన్నిక

**పినపాక ప్రతినిధి, ఫిబ్రవరి 3 (నేషనలిస్ట్ వాయిస్) :**

మండలంలోని చవిటిగూడెం గ్రామంలో మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నూతన మహిళా కమిటీలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు విలాసాగరపు కోటేశ్వరరావు నేతృత్వంలో ఎన్నుకున్నారు.

అధ్యక్షురాలుగా బయ్య లింగమ్మ, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శి హైమావతినీ ఎన్నుకున్నారు. తొలుత అధ్యక్షుడు వారిని పార్టీలోకి ఆహ్వానించి వారికి పార్టీ కండువాలను కప్పారు. అనంతరం నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ మండలంలో కూలీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న దినసరి కూలీలకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికుల శ్రమను దోచుకుని తక్కువ వేతనాలు ఇస్తే ఉద్యమం తప్పదన్నారు.



# పెద్దదగడ గ్రామంలో జోరుగా సాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం

### పన్నులను పరివేక్షణ చేస్తున్న ఏపీఓ ధనుంజయ్ రాజ్

**చిన్నంబావి మండలం నేషనలిస్ట్ వాయిస్**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో జోరుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు. ఈ పనులను సోమవారం నుంచి ప్రారంభించడం జరిగింది. గ్రామంలో పీటర్ ఛానల్ కాలువలో పూడికతీత పనులు ప్రారంభించడం జరిగింది. ఈ పనులను ఏపీఓ ధనుంజయ్ రాజ్ దగ్గరుండి పర్యవేక్షణ చేయడం జరిగింది. ఏపీవో ధనుంజయ్ రాజు మాట్లాడుతూ కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొలతల ప్రకారం పనులు చేయాలని సమయానికి పనికి రావాలని కూలీలకు తెలియజేయడం జరిగింది. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు తెలియజేశారు. అనంతరం కూలీల దగ్గర ఉన్న హాజరు మాస్టర్ను తనిఖీ చేసి కూలీల హాజరు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ్ రాజ్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.





# వైద్య రంగంలో మహిళలదే హవా: డాక్టర్ బ్లెస్సీ

**నేషనలిస్ట్ వాయిస్‌-చండూరు మండలం ఫిబ్రవరి 3**



వైద్య రంగంలో మహిళలు అద్భుత ప్రగతి సాధిస్తూ ముందంజలో ఉన్నారని డాక్టర్ బ్లెస్సీ కొనియాడారు. నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడంలో మహిళా వైద్యులు ముందున్నారని తెలిపారు. ప్రతి ఏటా వైద్య విద్యలో మహిళల సంఖ్య గణనీయంగా పెరగడం శుభపరిణామన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో మహిళా డాక్టర్ల పాత్ర వెలకట్టలేనిదని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఘనంగా ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలు

**సుల్తానాబాద్, ఫిబ్రవరి-03నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండలం, మున్సిపాలిటీ స్థాయి పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు మంచి వేదిక లభిస్తోందని పేర్కొన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని తెలిపారు.ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ప్రకాష్ పెద్దన్న వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, సంధ్య, శ్రీవాణి,ఆసియా,సరోజ,స్వప్న,వెంకటేష్, మధుకర్, సంపత్, సత్యం, ఇక్బాల్, అజ్జు, రంజిత్, మమత విద్యార్థులు పాల్గొన్నారు..







# సీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం

## రేవంత్ రెడ్డి విమర్శలపై మండిపడ్డ హరీష్



**హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు హైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. విద్వేష రాజకీయాలకు, నరంలేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు. ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అని ఘాటు విమర్శలు చేశారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అన్నారు. లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి..? నువ్వు అమెరికాలోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టమైందని

# జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

## జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట

## కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి



**జగిత్యాల,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనుసన్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

## ప్రతిపైసనూ లెక్కించనున్న అధికారులు

**నిజామాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉప సంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వహిస్తున్నారా? ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీ ఖర్చులో చూపించారా?, సోష ల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ఫ్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడంతో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితిపై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక చూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

# మరోమారు ఝలక్ ఇచ్చిన పసిడి ధరలు

## తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# అధ్వాన్న రోడ్డు దుస్థితిపై ఆందోళన

## మూకుమ్మడిగా గ్రామస్థుల నిరసన ధర్నా

## దిగివచ్చిన అధికారులు..పరిష్కారానికి హామీ

**జనగామ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

రోడ్డు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ పట్టించుకోక పోవడంపై గ్రామంలోని యువత ఏకమయ్యింది. సమస్యపై ధర్నాతో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చింది. జనగామ జిల్లాలోని కొడవటూరు కమాన్ క్రాస్ నుంచి బచ్చన్నపేట ఎస్సార్ పెట్రోల్ బంక్ వరకు గుంతలమయంతో అధ్వానంగా మారిన జనగామ- సిద్దిపేట రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం భారీ రాస్తారోకో ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు నిర్వహించిన ధర్నాలో జనగామ, ఆలేరు, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడెక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ప్రతిరోజు ఎంతోమంది ఈ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని అన్నారు. బైకులపై వెళ్లిన పలువురు యువకులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు పత్రికల ద్వారా సమస్యను విన్నవించిన కూడా అధికార యంత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవ రిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారి షాపుల్లోకి విపరీతంగా దుమ్ము వెళ్లడంతో వారు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. మాస్క్ పెట్టితేనే షాపు తెరవాలే తప్ప, వేరే మార్గం లేదన్నారు. కలెక్టర్ రావాలి. రోడ్డు నిర్మాణం పై హామీ ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా విరమించాలని ఎస్ఐ హమీద్ కోరిన వారు వినలేదు. జిల్లా స్థాయి అధికారులు రావాలి, తమకు కచ్చితంగా హామీ ఇవ్వాలి అంటూ మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ హస్సేన్ రాస్తారోకో వద్దకు వచ్చి, రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి, పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ బచ్చన్నపేట యూత్ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

## విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

# రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

## రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి

## యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

## తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు

## ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు.



ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాటు నిరుద్యోగుల ఉసురుపోసుకున్న బిఆర్ఎస్

## కాంగ్రెస్ వచ్చాకే నియామకాలు చేపట్టిన సిఎం రేవంత్

## బిఆర్ఎస్ దొంగ ఏడుపులపై మండిపడ్డ ఎమ్మెల్సీ బల్మూరి

**హైదరాబాద్,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై మండిపడ్డారు బల్మూరి వెంకట్. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్ వర్డ్ రిజిస్ట్రార్ల ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామంటూ.. ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

## వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

## అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల



అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పరీక్ష లో సమయంలో ఒత్తిడికి లోను కావద్దు

## ఇష్టంగా చదవండి..అర్థంచేసకుని రాయండి - చదువు పేదరికాన్ని జయించే శక్తి ఇస్తుంది

## విద్యార్థులకు వసతులు కల్పనలో నిర్లక్ష్యం వద్దు - బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్

నల్లగొండ,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఇష్టంగా చదవాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ శ్రీధర్ అన్నారు. బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు 8వ తరగతి నుంచే ఇంగ్లీష్ లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ హాస్టల్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ స్కూల్స్, గురుకుల విద్యాసంస్థల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో వెనుకబడటానికి ప్రధాన కారణం ఇంగ్లీష్ భాషపై సరైన అవగాహన లేకపోవడమేనని పేర్కొన్నారు.విద్యార్థుల్లో చిన్న తరగతుల నుంచే రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ స్కిల్స్‌ను పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. 8 వ తరగతి నుంచే ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తే టెన్త్, ఇంటర్ దశలో పరీక్షల భయం తగ్గి మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారని తెలిపారు. సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే గురుకుల విద్యా విధానం మెరుగైనదని ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన వాతావరణం, నాణ్యమైన బోధన, వ్యక్తిగత శ్రద్ధ లభిస్తోందని అన్నారు.గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల అకడమిక్ ప్రగతితో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం జరుగుతోందని, ఈ విధానాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే సెక్రెటరీ బడుగు సైదులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లీషు, మ్యాథ్స్ శిక్షణ, ప్రత్యేక తరగతులు నిర్వహించి భవిష్యత్తులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ లో విజయం సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాలు కల్తీ జరగకుండా సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు . పేరెంట్స్ మీటింగ్ తప్పక పెట్టాలని , సొంత బిల్డింగ్ ఉన్న హాస్టల్లో మౌలిక సదుపాయాలు కావలసిన రిపేరు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఏ సంజీవ, ఉమ్మడి జిల్లాల ఆర్ సి వో స్వప్న , సంబంధిత శాఖాధికారులు, హాస్టల్ ఆఫీసర్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# సిట్ నివేదికను కాదని విమర్శలా?

## జంతువుల కొవ్వు కలవలేదని నివేదిక ఇచ్చాక విచారణలా?

## అడ్డంగా దొరికిపోవడంతోనే చంద్రబాబు తంటాలే

## టిటిడి మాజీ ఛైర్మన్ బూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూలో జంతుకొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలిపిన నెయ్యి వాడారని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు అడ్డంగా దొరికి పోయారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ధ్వజమెత్తారు. అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్న సీబీఐ సిట్ ఛార్జ్‌షీట్‌తో అడ్డంగా దొరికిపోయి, తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానాపాట్లు పడుతున్నారని విమర్శించారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం నియమించిన సిట్, నెయ్యిలో ఏ కొవ్వూ కలవలేదని చెప్పినా, మళ్లీ ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేయించాలని నిర్ణయించడమే ఇందుకు నిదర్శనం అని ఆయన వెల్లడించారు. ప్రభుత్వానికి చేతనైతే సిట్ రిపోర్ట్ తప్పని సుప్రీంకోర్టును ఆశ్రయించి, అక్కడ రుజువు చేయాలని తిరుపతిలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్‌రెడ్డి సవాల్ చేశారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ అధికారుల్ని సీఎం చంద్రబాబు పిలిపించుకోవడం అసాధారణ విషయం. వారి దగ్గరి నుంచి 11 పేజీల నివేదిక తీసుకుని సుదీర్ఘమైన చర్చ చేశామని కేబినెట్ భేటీ నుంచి బయటికి వచ్చిన మంత్రులు చెప్పారు. చంద్రబాబును కాపాడటానికి, ఆయన చెప్పిన అబద్దాల్ని కప్పిపుచ్చడానికే వీళ్ల ప్రయాస తప్ప మరోటి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు కలిపారని ప్రకటించడంతో, వాస్తవాలు నిగ్గు తేల్చాలని వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, ఏ విషయమూ నిర్ధారణ కాకుండా మాట్లాడొద్దంటూ సూచించిన సుప్రీకోర్టు, ఈ వ్యవహారంపై సిట్ ఏర్పాటు చేసింది. అందులో సీబీఐ అధికారులతో పాటు రాష్ట్ర అధికారులు కూడా ఉన్నారు. సిట్ అధికారులు ఏడాది కాలంగా సుదీర్ఘ విచారణ చేసి నివేదిక ఇచ్చారు. సిట్ అదనపు ఛార్జిషీట్‌లో కానీ, ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ రిపోర్టులో కానీ, చంద్రబాబు ఆరోపించినట్లు నెయ్యిలో జంతువుల కొవ్వు కానీ, చేప నూనె కానీ కలిసినట్లు ఎక్కడా చెప్పలేదు. అయినా చంద్రబాబు ఈ ఛార్జిషీట్‌పై సంతృప్తి చెందకుండా ఇవాళ కేబినెట్ సమావేశంలో నెయ్యి విషయంలో ప్రత్యేక విచారణ చేపడుతున్నట్లు మంత్రులతో బయట ప్రకటన చేయించారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ రిపోర్టు కాకుండా, మళ్లీ విచారణ చేయించాలన్న నిర్ణయం పూర్తిగా తప్పని భూమన అన్నారు. ఒక మంత్రి భోలే బాబాను తెచ్చిన అలీ బాబా ఎవరని ప్రశ్నించారు. ఈ భోలే బాబాను తెచ్చిన చంద్రబాబే. 2018లోనే భోలే బాబా రంగ ప్రవేశం చేశాడు. దాదాపు 87 వేల టిన్నులకు పైగా నెయ్యి ఈ కంపెనీ సరఫరా చేసింది. అది చాలా స్పష్టంగా సీబీఐ నివేదికలోనే ఉంది. కానీ దాన్ని వదిలేసి మా హయాంలోనే నెయ్యి సరఫరా చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నిజంగా తిరుమల శ్రీవారి మీద భక్తి ఉంటే, మీ గత ప్రభుత్వంలో సరఫరా అయిన నెయ్యిపైనా విచారణ చేయించాలి. ఆ రోజు 90 శాతానికి పైగా నెయ్యి సరఫరా చేసిన డెయిరీయే మా హయాంలోనూ సరఫరా చేసిందన్న విషయం మీకు గుర్తు చేస్తున్నాం అని అన్నారు. టీటీడీని రాజకీయ పావుగా వాడుకోకపోతే మీ హయాంలోనే నెయ్యి సరఫరా చేసిన వాళ్లు, కొనుగోళ్లు చేసిన వాళ్ల మీద విచారణ చేయించండి. ఇప్పుడు అనిల్ కుమార్ సింఘాల్ దోషి అంటున్నారు. సిట్ ఏర్పాటు చేశాక జంతుకొవ్వు విమర్శలు చేసిన మీరు ఆయన్ను రెండోసారి ఎందుకు ఈవోగా నియమించారని అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పదే పదే నెయ్యిలో జంతుకొవ్వు, పందికొవ్వు, చేప నూనె వాడారని దుష్ప్రచారం చేశారు. మీరు ఆరోపించినట్టు ఆ నెయ్యిలో అవేవీ లేవని తేలిపోయింది. అయినా మీరు ఇంకా ఎదురుదాడి చేస్తూ, గత మా ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తిరుమల శ్రీవారిపై భక్తి ఉంటే, ఏ రాజకీయ ప్రయోజనాలు ఆశించకపోతే.. మీ హయాం నుంచే జరుగుతున్న నెయ్యి కల్తీపై విచారణ చేయించమని కోరుతున్నట్లు వెల్లడించారు. మేం నిబంధనల్ని సడలించడం వల్ల నెయ్యి కల్తీ జరిగిందనేది అబద్ధం అని భూమన అన్నారు. కేవలం దురుద్దేశంతో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మీద నింద వేయాలని చూశారు. ఇప్పుడు మళ్లీ ప్రత్యేకంగా విచారణ చేయిస్తాం అంటున్నారు. నెయ్యి మీద మీరు విచారణలు చేయడం కాదు మళ్లీ సుప్రీంకోర్టుతోనే ఆ పని జరిగేలా చూడాలని భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మాజీమంత్రి జోగి రమేశ్‌కు అనిల్ కుమార్ పరామర్శ

## కుట్ర పూరితంగానే దాడులు జరిగాయని ఆరోపణ

విజయవాడ,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

కూటమి ప్రభుత్వ ఎక్స్‌పైరీ డేట్ దగ్గరలో పడిందని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు.ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాలు పెట్రోల్ బాంబులు,మారణాలయుధాలతో దాడులకు తెగబడిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై జోగి రమేష్ కుటుంబాన్ని అనిల్ కుమార్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడారు.'కూటమి ప్రభుత్వంలో రాక్షస పాలన సాగుతోంది. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు ఉందని తప్పుడు ప్రచారం చేశారు. తాను చేసింది అసత్య ప్రచారం అని తెలిసి పశ్చాత్తాపం పడకుండా దాడులు చేయిస్తున్నాడు.ప్రశ్నించిన వారి పై కేసులు పెట్టడం దాడులు చేయించడమే చంద్రబాబు పని. అంబటి రాంబాబు,జోగి రమేష్ ఇళ్ల పై వందల మంది గూండాలతో దాడి చేయించారు.జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు వేయించారు. దాడి సమయంలో జోగి రమేష్ తండ్రి, భార్య,కుమారుడు ఇంటిలోనే ఉన్నారు.ఇంట్లో ఉన్న మహిళలకు ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత.మీ పార్టీలో ఉన్నవారే మహిళలా. మీ పార్టీలో ఉన్నవారే బిసిలు,కాపులా. ప్రశ్నిస్తాననేపై పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనం వహిస్తున్నాడు.జగన్ ఐదేళ్ల పాలనపై ఫ్యాక్షన్ ముద్ర వేశారు. నిజంగా మీరు చెప్పినట్లు ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తే ఏపీలో మీరు తిరగ గలిగేవారా. ప్రజలు మీకు ఓటేసింది ప్రజలకు మంచి చేయమని. ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులు చేయడానికి కాదు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో తిరుగుబాటు తప్పదు.టీడీపీ వాళ్లు ఏమైనా చేస్తామని బెదిరిస్తున్నారు. జగన్ ఐదేళ్లలో ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడలేదు.

# సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ

హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యా లతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ జూలో తెల్లపులి మృతి

## వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

వరంగల్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్దాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

# నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

# యూరియా యాప్‌తో తొలగిన కష్టాలు

## వెల్లడించిన వ్యవసాయ శాఖ

హైదరాబాద్,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

యూరియా సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా, నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతోందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. గతంలో యూరియా సరఫరాలో చోటు చేసుకున్న బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపకల్పన చేశారు. జిల్లా యూనిట్‌గా యూరియా బుకింగ్ విధానం అమలు చేయడం ద్వారా, స్థానిక అవసరాల ఆధారంగా సరఫరాను నియంత్రిస్తూ, ప్రతి రైతుకు న్యాయమైన వాటా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యూరియా యాప్ ద్వారా పంటల వారీగా అవసరమైన పరిమాణానికే బుకింగ్ జరుగుతుండటంతో, నిజమైన రైతులకే ఎరువులు చేరుతున్నాయి. ÷ఔరియా యాప్ అనేది కేవలం ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదు అది, నిజమైన రైతులకు యూరియా అందించేందుకు,ళారుల ప్రమేయం మరియు బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు, సరఫరా వ్యవస్థలో పారదర్శకతకు ప్రభుత్వం తీసుకున్న సంస్కరణాత్మక చర్య. ఎప్పటికప్పుడు మండల స్థాయి మొదలుకుని ఉన్నత స్థాయి అధికారులు రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఈ యాప్ పైన రైతుల అభిప్రాయాలు తీసుకుంటూ దానికి తగ్గట్టు మార్పులు చేస్తూ ఇప్పటికి 22 జిల్లాలో అమలు చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సవరణలు చేస్తూ యూరియా యాప్ అమలు కొనసాగించబడుతోంది. యూరియా యాప్ ప్రారంభించిన నేటి వరకు, రాష్ట్రవ్యాప్తంగా 5.75 లక్షల మంది రైతులు యాప్ ద్వారా మొత్తం 20.79 లక్షల యూరియా బస్తాలను కొనుగోలు చేయడం జరిగింది.

# ట్రాక్టర్ బోల్తా : నలుగురు కూలీల మృతి

జగిత్యాల,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంజరిగింది. ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# భద్రకాళిని దర్శించుకున్న పవన్ సతీమణి

వరంగల్,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు.. ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్నపన మండపంలో ముఖ్యఅర్చకులు వెంకటనాగరాజ శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ మహదాశీర్వచనం పలికి.. అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# నేడు గుంటూరు పర్యటనకు జగన్

## అంబటి రాంబాబును పరామర్శించనున్నట్లు వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరులో పర్యటించనున్నారు. అంబటి రాంబాబు కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించ నున్నారు. టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన ఇల్లు, ఆఫీసుని వైఎస్ జగన్ పరిశీలించనున్నారు.

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

## వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ-ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

## మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

# వీఎస్ఆర్ కంపెనీకి విమానయానశాఖ షాక్

## అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డిజిసిఎ దర్యాప్తు

## బ్యాలెన్స్ షీ, లాగ్ బుక్‌ను చెక చేయనున్న అధికారులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌పై స్పెషల్ ఆడిట్‌కు ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆడిట్ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. ఆడిట్‌లో భాగంగా వీఎస్ఆర్ కంపెనీకి చెందిన బ్యాలెన్స్ షీట్స్, లాగ్ బుక్స్‌ను అధికారులు చెక్ చేయనున్నారు. ఈ చెకింగ్స్ ద్వారా ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన మెయిన్‌టెన్స్ వివరాలు తెలుసుకో నున్నారు. ప్రోటోకాల్ ప్రకారం లాగ్ బుక్ ఫిల్ చేస్తున్నారా? లేదా గుర్తించనున్నారు. మరో వైపు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కూడా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తోంది.కాగా, అజిత్ పవార్ లియర్‌జెట్ 45బీఖీ విమానంలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ లియర్‌జెట్ 45బీఖీ విమానం వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. విమానాలను అ÷-దదెకు ఇచ్చే అతి పెద్ద సంస్థలలో వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఒకటి. ప్రమాదం జరిగిన తర్వాత సంస్థ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'నా దగ్గర ఉన్న విమానాలు అన్నీ చాలా మంచి కండీషన్‌లో ఉన్నాయి. అలాంటి వాటిని ఎందుకు నిలిపివేస్తాను. లియర్‌జెట్ విమానాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. అలాంటి వాటిని నేను కచ్చితంగా నిలిపివేయను' అని స్పష్టం చేశారు. అజిత్ అనంతరావు పవార్ జనవరి 28వ తేదీన బారామతిలో జరిగే ఓ కార్యక్రమానికి వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లియర్‌జెట్ 45బీఖీ విమానంలో బయలుదేరారు. బారామతి ఎయిర్‌పోర్టు వద్ద విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ల్యాండ్ కావాల్సిన విమానం మళ్లీ గాల్లోకి లేచింది. ఉదయం 8.45 గంటల సమయంలో నేలపై పడి పేలిపోయింది. అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ఈ ప్రమాదంలో చనిపోయారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు నో అబ్జెక్షన్: సుప్రీం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

# మణిపూర్ కొత్త సిఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్

ఇంఫాల్,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన భాజపా శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. బిజెపి అధిష్టానం అయనను ఎంపికచేసింది. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్‌జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపుర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో మణిపుర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరెన్‌సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ బాధ్యతలు చేపట్టనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.మణిపుర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

# అమెరికాతో ట్రేడ్ డీల్‌తో ఉజ్వల భవిష్యత్

## కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకొచ్చారని, ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు చెబుతోందన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా.. పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించాను. కానీ.. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ గందరగోళ పరిస్థితులను సృష్టించింది. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన యత్నిస్తుండటం విచారకరం. దేశ ప్రగతితో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. ఈ ఒప్పందంలో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారు. ట్రంప్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగా రెండు దేశాల మధ్య మంచి ఒప్పందం కుదిరింది. ప్రతీకార సుంకాలను విధించింది అమెరికానే కాబట్టే.. సుంకాల తగ్గింపునకు సంబంధించిన ప్రకటన కూడా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) నుంచే వచ్చింది. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేస్తున్నాం. త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని వెల్లడించారు.

# ఎపిలో రెడ్ బుక్ రాజ్యాంగం

## ▸▸దాడులు, అక్రమ కేసులు పెరిగాయి ▸▸పార్లమెంట్ ఆవరణలో వైకాపా ఎంపిల నిరసన

## రాష్ట్రపతి పాలన విధించాలని ఎంపిల డిమాండ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని వెరసి శాంతి భద్రతలు విఫలమయ్యాయని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటు ఆవరణంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఏపీలో కూటమి ఆటవిక పాలనను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఎదుట ధర్నా చేపట్టింది. మంగళవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. ఏపీ శాంతి భద్రతల వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని.. అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలని నినాదాలు చేశారు. ఇళ్లు, కార్లు తగులబెట్టడం, తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం వంటి దుశ్చర్యలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ పాలనకు బదులు సొంతంగా రూపొందించుకున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'ను అమలు చేస్తున్నట్లుగా పరిస్థితి మారిందని, దీనివల్ల ప్రజలకు, ప్రతిపక్షాలకు న్యాయం పూర్తిగా దూరమైందని తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని ఇళ్లపై జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఇవి కూటమి ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసులు నిస్సహాయ స్థితిలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన బాధ్యత తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు డిమాండ్ చేశారు.ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోంది. ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడులు పరిపాటిగా మారాయి. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి. శాంతి భద్రతలను పరిరక్షించాలి. రాష్ట్రపతి పాలన విధించాలి అని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతీకార రాజకీయాలు మొదలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని.. అక్రమ కేసులు, అరెస్టులు చేయించడమే కాదు.. హత్యలకూ పాల్పడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా వదలడం లేదు. ఈ క్రమంలోనే.. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై అధికార టీడీపీ దాడులు చేసింది. ఈ జంగిల్ రాజ్‌పై చట్టబద్ధంగా, అహింసా పద్ధతుల్లో వైస్సార్‌సీపీ పోరాటాన్ని ప్రారంభించింది. ఇప్పటికే ఈ పరిస్థితులను కేంద్ర హోం శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది వైఎస్సార్‌సీపీ. త్వరలో హోంమంత్రి అమిత్ షాను కలసి పరిస్థితులను ఆయనకు వివరించాలని భావిస్తోంది.

# భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

## చమురు దిగుమతులపై చర్చ జరగలేదు-చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం

## డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):

అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం వేళ రష్యా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ స్పందించింది. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పరోక్షంగా వెల్లడించారు. ఈ అంశంపై న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయని పెస్కోవ్ పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ తన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుందని రష్యా విశ్వాసం వ్యక్తం చేసింది.ఇటీవల మోదీతో జరిపిన ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేస్తామని మోదీ తనకు మాటిచ్చారని ట్రంప్ ప్రకటించారు. తాము జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఇది అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. అయితే ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే రష్యా నుంచి ఈ వివరణ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. భారత్ వంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోందని పెస్కోవ్ ఆరోపించారు. వాషింగ్టన్ నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నా న్యూఢిల్లీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఉంటాయని రష్యా బలంగా నమ్ముతోంది. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని, ఎలాంటి మార్పులు ఉంటే దౌత్య మార్గాల్లో సమాచారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, భారత్ తక్కువ ధరకు రష్యా ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యా నుంచే తీరుతున్నాయి. ఈ వాణిజ్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు, రష్యాకు కూడా ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో చమురు కొనుగోళ్లు ఆపేయడం అంత సులభం కాదని, ఇది కేవలం ట్రంప్ రాజకీయ విన్యాసాల్లో భాగం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాలకులే గుండాల్లా..రౌడీల్లా మారారు

## మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం' అని హెచ్చరికలా

## రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్న టిడిపి నేతలు-మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని

అమరావతి,ఫిబ్రవరి3(నేషనలిస్ట్ వాయిస్):

వైఎస్సార్‌సీపీ శ్రేణులను టా÷-గ్గ్÷ట్ చేస్తూ టీడీపీ నేతల సృష్టిస్తున్న అరాచకంపై మాజీ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పాలకులే గూండాల్లా, రౌడీల్లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 'మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం' అని టీడీపీ నేతలు మాట్లాడటం ఏ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. ఈరోజు(మంగళవారం, ఫిబ్రవరి 3వ తేదీ) తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం నుంచి మాట్లాడిన విడదల రజిని.. 'మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం అని ఎమ్మెల్యే మాధవి బెదిరిస్తున్నారు. ఆమెను టీడీపీ బలిపశువు చేస్తోందని గుర్తుంచుకుంటే మంచిది. మహిళా పక్షపాతి లాగ తెగ బిల్డప్‌లు ఇస్తారు.. మళ్లీ మీరే దాడులు చేస్తారు. కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారు. లడ్డూ ఇష్యూను డైవర్ట్ చేసేందుకు టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారు. మాపై దాడి చేసి తిరిగి మాపైనే కేసులు పెట్టారు. మాపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే.. కనీసం స్పందన లేదు. కూటమి పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని గుడికెళ్లి మొక్కుకుంటే తప్పా. వెంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఏం జరుగుతుందో మీకు బాగా తెలుసు కదా. వైఎస్సార్‌సీపీ వాళ్లు ఏ గుడికి వెళ్లొద్దని చట్టం చేయండి. తిరుమల లడ్డూ వ్యవహారంలో జరగని కల్తీని జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. మేము కూటమి నేతలను నిలదీస్తున్నామనే మాపై దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది. రాష్ట్రంలో రాజ్యాంగం లేదు.. ప్రజాస్వామ్యం లేదు.. శాంతి భద్రతలు లేవు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలసీ, రెడ్‌బుక్ పాలన నడుస్తోంది. రెడ్‌బుక్ అరాచకంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మీరెన్ని దాడులు చేసినా మేము ప్రజల పక్షాన పోరాడుతాం' అని స్పష్టం చేశారు.

# ఎకరా భూమి కోసం దారుణం

## సవతితల్లి, సోదరుడి దారుణహత్య

## హత్యలతో గ్రామంలో తీవ్ర విషాదం

**అనంతపురం,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

అనంతపురం జిల్లాలోని శింగనమల మండలం తరిమెల గ్రామంలో దారుణ ఘటన జరిగింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యారు. తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నల్లప్ప మరణించిన తర్వాత ఆయనకు సంబంధించిన ఆస్తి పంపకాల విషయంలో మొదటి భార్య పిల్లలకు, రెండవ భార్యకు మధ్య గత కొంతకాలంగా తీవ్ర వివాదాలు నడుస్తున్నాయి. ఈ వివాదాలే ఇప్పుడు హత్య వరకు దారితీశాయి. నల్లప్ప రెండవ భార్య యల్లమ్మ(38) స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. యల్లమ్మ సహా ఆమె కుమారుడు చిన్నా(22)లను దారుణంగా చంపేశారు. కొద్ది కాలం నుండి ఆ ఎకరా పొలంలో మాకూ సగం కావాలంటూ పెద్ద భార్య లక్ష్మీదేవి కొడుకులు ఇద్దరు ఎల్లమ్మతో గొడవ పడుతుండేవారు. ఆ గొడవల వల్ల సోమవారం అర్ధరాత్రి సమయంలో ముందస్తు ప్లాన్‌తో ఎల్లమ్మ ఆమె కొడుకు చిన్న ఇద్దరు ఇంటిలో నిద్రిస్తున్నప్పుడు ఒక్కసారిగా లక్ష్మీదేవి కొడుకులు ఓంకార్, జగజ్జీవన్ ఇద్దరూ వేటకొడవళ్ళతో వచ్చి ఎల్లమ్మ కొడుకును నరికారు. ఎల్లమ్మను వెంటాడి ఆమె తల నరికి తలను తీసుకొని గ్రామంలో ఉన్న నాగుల కట్ట మీద పెట్టి ఎవరైనా రండిరా ..! అంటూ పెద్దగా కేకలు వేస్తూ లక్ష్మీదేవి కుమారులు రెచ్చిపోవడంతో గ్రామ ప్రజలు భయపడి ఇంటిలో నుంచి బయటికి ఎవరు కూడా రాలేకపోయారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి గాలిస్తున్నారు. మొదటి భార్య కుమారులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక సమాచారం. భూమి లేదా ఇతర ఆస్తుల పంపిణీలో తలెత్తిన ఘర్షణలే ఈ జంట హత్యలకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల విచారణ ప్రకారం.. హత్య సమాచారం అందిన వెంటనే పోలీసులు తరిమెల గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు హత్యలతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ కలహాలు ప్రాణాలు తీసే స్థాయికి వెళ్లడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి కోసం కనికరం లేకుండా ప్రాణాలు తీయడం సమాజంలోని నైతిక విలువల పతనాన్ని సూచిస్తోంది. ఆస్తి తగాదాల నేపథ్యంలోనే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమికంగా తేలిందని పోలీసులు వెల్లడించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని జిల్లా పోలీసులు తెలిపారు.

# వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి మైలురాయి

## గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయం

## ఒప్పందాన్ని స్వాగతించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలు రాయి అని సీఎం చంద్రబాబు అన్నారు. దీన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. టారిఫ్‌లను 18శాతంకు తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇది నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంటోందన్నారు. ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ముఖ్యంగా ఏపీలోని యువత, రైతులకు విస్తృత అవకాశాలను సృష్టించనుందని చంద్రబాబు పేర్కొన్నారు.భారత్ – అమెరికాల మధ్య కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని చంద్రబాబు నాయుడు స్వాగతించారు. ఈ ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి చారిత్రాత్మక మైలురాయి అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ ఒప్పందం కుదరడంపై సీఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ద్వారా ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సీఎం పేర్కొన్నారు. నిరంతరం ప్రపంచ వృద్ధిని కాంక్షించేలా ఈ దార్శనిక నిర్ణయం ఉందని వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా తన పాత్రను సుస్థిరం చేసుకుంటోందన్నారు సీఎం. భారత ఎగుమతుల్లో పోటీతత్వాన్ని గణనీయంగా పెంచేలా ఒప్పందం ఉందన్నారు.

# వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి మైలురాయి

## చంద్రబాబు, సోమిరెడ్డిలపై దుర్భాషలు

## మాజీమంత్రి కాకానికి పోలీసుల నోటీసులు

**నెల్లూరు,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై మరోమారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అధికారులు నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో పరుష పదజాలంతో దుర్భాషలాడిన ఆరోపణలపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో నెల్లూరు రూరల్, పొదలకూరు, మనుబోలు పోలీస్ స్టేషన్లలో కాకాణిపై కేసులు నమోదయ్యాయి. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి తల్లిదండ్రులపైనా కాకాణి దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం కాకాణి నివాసానికి వెళ్లి, ఆయనతో మాట్లాడిన అనంతరం నోటీసులు అందజేశారు. ఈ కేసుల్లో విచారణకు సహకరించాలని, అవసరమైన వివరాలు అందించాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో నెల్లూరు జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కింది. పోలీసులు నోటీసులు ఇచ్చారని.. సాయంత్రమే విచారణకు రావాలని చెప్పారని మాజీ మంత్రి కాకాణి తెలిపారు. తాను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు గాను విచారణకు పిలిచినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఏ అంశంలో తాను ఆరోపణలు చేశానో స్పష్టంగా చెప్పాలని పోలీసులను అడిగినట్లు తెలిపారు. ఏ అంశంలో విచారణకి రమ్మంటున్నారో చెబితే, వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకు వెళతానన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ అంశం ఉందనేది స్పష్టత లేదన్నారు మాజీ మంత్రి. కేసుకు సంబంధించిన వివరాలు ఇస్తే, విచారణకు హాజరవుతానని కాకాణి గోవర్ధన్ స్పష్టం చేశారు.



# తిరుమల లడ్డూ కల్తీపై కేబినెట్ కీలక నిర్ణయం

## - అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్

## - కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని తీర్మానం

**అమరావతి,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూడు గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో సిట్ నివేదికపైనా చర్చ జరిగింది. ఆ నివేదికలో పాత్రధారులపైనే చర్యలకు సిట్ సిఫార్సు చేసిందని అభిప్రాయపడింది. సిట్ విచారణ, ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. ఈ మూడింటిపై అధ్యయనం చేసి వాస్తవాల సమర్పణకు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్‌షీట్‌లో ఎందుకు నమోదు చేయలేదనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది. సిట్ నివేదికలోని లోపాలను సరిచేసి, అసలు సూత్రధారులను కనుగొనేందుకు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. అప్పట్లో పర్చేస్ కమిటీకి సభ్యులు కాని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచారని సీఎం చంద్రబాబుకు మంత్రులు వివరించారు. అయితే, ఆనాడు కమిటీ సభ్యులుగా ఉన్న తనను, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పిలవలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. రసాయనాల మిశ్రమం కలిసిన లడ్డూలను అయోధ్యకు కూడా పంపారని కేబినెట్‌లో అధికారులు పేర్కొన్నారు. నెయ్యి టెండర్ నిబంధనలను మార్చడంపైనా మంత్రి వర్గంలో చర్చ జరిగింది. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్ దక్కించుకున్నారని, టెండర్ నిబంధనలను మార్చినప్పటికీ ఈఓగా ఉన్న సింఘాల్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై పలువురు మంత్రులు ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా పట్టించుకోకపోవడంపై చర్చించారు. అప్పటి అధికారులు బాలాజీ, సుబ్రహ్మణ్యం దానిని పక్కన పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉందని తేలిందని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రులు తెలిపారు. సిట్ నివేదికలో కొంతమంది పేర్లు పేర్కొన్నప్పటికీ, చివరి ఫైడింగ్స్‌లో వాటిని పేర్కొనకపోవడంపై చర్చ జరిగింది. ఈ లోపాలన్నింటిపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించింది. టెండర్ ప్రక్రియలో లోపాలపై దృష్టి సారించాలని కమిటీకి మంత్రిమండలి సూచించింది. సహకార డెయిరీలను పక్కన పెట్టేందుకు పథకం రూపొందించారని కేబినెట్ పేర్కొంది. సహకార డెయిరీలను పక్కన పెట్టడం ద్వారా బోగస్ డెయిరీలను రంగంలోకి తీసుకువచ్చారని అధికారులు వివరించారు. దీనిపైనా ఎంక్వైరీ కమిటీ దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్వకేట్ జనరల్, సీనియర్ అధికారుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఛైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర గురించి సిట్ నివేదికలో ఏమైనా పేర్కొన్నారా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఛార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ ఉందని పేర్కొన్నారా? అని కూడా పవన్ అడిగారు. ఛార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో స్పష్టంగా పేర్కొన్నారని పవన్‌కు చెప్పారు అధికారులు. అసలు సూత్రధారులను వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. సిట్ నివేదికలో లోపాలు ఉన్నాయని, అసలు సూత్రధారులను బయటకు తీసుకురాలేక పోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అసలు సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని మంత్రులు చెప్పారు. ఈ విషయాలను బహిర్గతం చేసేందుకే కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ఎవరిపై చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు

## కల్తీ సంగతి తెలిసీ మౌనా వైకాపా పాలకులు

## సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు-కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రులు

**అమరావతి,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**



కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. సీఎఫ్‌టీఆర్ఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలని అన్నారు. కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే అన్నారు. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. హిందూధర్మం మూలాలను దెబ్బతీసే విధంగా వైకాపా చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు.

# స్త్రీశక్తి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ

## - డిమాండ్‌కు తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు పెంచాలి

## - సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్

**విజయవాడ,ఫిబ్రవరి 3(నేషనలిస్ట్ వాయిస్):**

డిమాండ్‌కు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈనెల 2, 3 తేదీలలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన సిపిఐ (యం) రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడ యం.బి. విజ్ఞానకేంద్రం లో జరిగాయి. ఈ సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, యు.వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. డిమాండ్ కనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలనే తీర్మానాన్ని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మంగళవారం సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఓ ప్రకటనను విడుదల చేసింది.డిమాండ్ కనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలని సిపిఐ(యం) నేతలు కోరారు. స్త్రీ శక్తి పథకం తరువాత ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 67 శాతం నుండి 98 శాతానికి పెరిగిందనీ అయితే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిపోల్లోనే బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కడంతో మధ్యలో స్టేజీలలో ప్రయాణీకులను ఎక్కించుకోవడం లేదని, దిగవల్సిన ప్రయాణీకులను ఆగాల్సిన ప్రదేశంలో కాకుండా ముందుకు వెళ్ళి ఆపుతున్నారు అని అంతే కాక మహిళా ప్రయాణీకులను కొంతమంది పురుషులు, సిబ్బంది హేళనగా మాట్లాడుతున్నారు అని, బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని వివరించారు. సకాలంలో స్కూళ్ళకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారని చెప్పారు. ఆక్యుపెన్సీ పెరగడంతో, బస్సులు పాతవి కావడంతో తరచు మధ్యలో ఆగిపోతున్నాయని, రాత్రి సమయాల్లో కూడా ఆగిపోయి ఇబ్బందులు కలుగుతున్నాయని, ముఖ్యంగా స్త్రీలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడమేనన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేశాకే ఈ పథకం మన రాష్ట్రంలో అమలు చేశారు? కానీ పెరిగే ఆక్యుపెన్సీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయవలసిన బాధ్యతను వదిలేశారని ఆరోపించారు. ఫలితంగా ప్రయాణీకులు తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల ప్రయివేటు బస్సులలో 3 ప్రమాదాలు జరిగాయని, ఈ బస్సులపై రవాణా శాఖ సరైన పర్యవేక్షణ లేదని చెప్పారు. ప్రయాణీకుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని,. వీటిని కూడా ఆర్టీసీ తీసుకొని నడపాలని కోరారు. సిబ్బందిపై 30 శాతం పైగా పని ఒత్తిడి పెరిగిందని ఇన్సర్వీస్ మరణాలు కూడా పెరుగుతున్నాయని తాజా ఉదంతాలు తెలియజేస్తున్నాయన్నారు. 11 వేల మంది. సిబ్బంది కావాలని ఆర్టీసీ అడుగుతున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని.. ప్రభుత్వం తక్షణం సిబ్బందిని రిక్రూట్ చేయాలని కోరారు. మహిళలు ఆధార్, ఇతర గుర్తింపు స్మార్ట్ఫోన్లో చూపినా అనేకచోట్ల అనుమతించడం లేదనీ, దీన్ని అనుమతించాలని అడిగారు. అనేక గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సుల సర్వీసులు లేవని తెలిపారు. సక్రమంగా బస్సులు ఏర్పాటు చేస్తే మరింతగా ప్రయాణీకులు పెరిగే అవకాశం ఉంటుందని, ఆర్టీసీ ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. స్త్రీశక్తి పథకం అనేక విధాలా ఉత్పత్తి పెరుగుదలకు, కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తుందని అన్నారు. కానీ ప్రభుత్వం ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా విద్యుత్ వాహనాలకు అనుమతి ఇచ్చిందని.. ఇది స్త్రీ శక్తి పథకం ఎత్తివేయడానికి దారి తీస్తుందని తెలిపారు. కనుక ఇప్పటికే పెరిగిన ప్రయాణికుల అవసరానికి అనుగుణంగా తక్షణం అదనపు బస్సులను పెంచాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు వేయాలని సిపిఐ (యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని నేతలు పేర్కొన్నారు.

# ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

## రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

### మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, భద్రతపై వీడియో కాన్ఫరెన్స్

**జగిత్యాల ప్రతినిధి పిబ్రవరి 03, నేషనలిస్ట్ వాయిస్:**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు మరియు ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీజీపీ ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ పాత్ర, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు(ఎంసీసీ), పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, క్రిటికల్ మరియు సున్నిత ప్రాంతాలపై పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ బాధ్యతలు అత్యంత కీలకమని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను గుర్తించి బైండోవర్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు, సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వివరాలపై సంబంధిత అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని అన్నారు. ప్రతి అధికారి తన పరిధిలో పరిస్థితులపై స్పష్టమైన సమాచారం కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని



కఠినంగా అమలు చేయాలని, డబ్బు, మద్యం తదితర ప్రలోభాలకు సంబంధించిన అక్రమ రవాణా మరియు పంపిణీపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ రోజున అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని తెలిపారు. అలాగే, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య వార్తలపై సైబర్ విభాగం ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీజీపీ గారు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా బందోబస్తు ఏర్పాటు చేసి, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని, జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల భద్రతా ఏర్పాట్ల వివరాలను డీజీపీ కి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీ రఘు చందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు

## విజయవంతంగా ముగిసిన కొడిమ్యాల మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు రాష్ట్రస్థాయిలో రాణించాలి తహసిల్దార్ - కిరణ్ కుమార్

**కొడిమ్యాల:ఫిబ్రవరి03( నేషనలిస్ట్ వాయిస్).**

సీఎం కప్ 2వ ఎడిషన్ కొడిమ్యాల మండల స్థాయి ఎంపిక పోటీలు విజయవంతంగా మంగళవారం రోజున ముగిశాయి. స్థానిక కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బహుమతి ప్రధానోత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా కొడిమ్యాల మండల తహసిల్దార్ కిరణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఎస్ఐ సందీప్ కుమార్ తో కలిసి ఆయన బహుమతులు ప్రధానం చేశారు. కబడ్డీ పురుషుల విభాగంలో సూరంపేట ప్రథమ, నాచుపల్లి ద్వితీయ స్థానం, మహిళల విభాగంలో సూరంపేట ప్రథమ, తిరుమలాపూర్ ద్వితీయ స్థానం సాధించాయి. వాలీబాల్ బాలుర విభాగంలో హిమ్మత్రావుపేట ప్రథమ, నమిలికొండ ద్వితీయ, బాలికల విభాగంలో నమిలికొండ ప్రథమ, పూడూరు ద్వితీయ బహుమతులు సాధించాయి. ఖో ఖో బాలుర విభాగంలో కొడిమ్యాల ప్రథమ ,నాచుపల్లి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో నాచుపల్లి ప్రథమ, కొడిమ్యాల ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. చెస్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం కొడిమ్యాలకు చెందిన గౌతం కృష్ణ, ద్వితీయ స్థానం నాచుపల్లికి చెందిన సుశాంత్ లు గెలుపొందారు. అథ్లెటిక్స్ లో బాలుర విభాగంలో నాచుపల్లి, బాలికల విభాగంలో నమిలికొండ లు ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంఈఓ అయిత శ్రీనివాస్, ఎస్ఐ సౌదం సందీప్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఏ.విజయేంద్ర, ఎస్జిఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి లక్ష్మీ రామ్ నాయక్, ఎస్ జి ఎఫ్ మండల కార్యదర్శి బూట్ల రాజ మల్లయ్య, హమీదుల్లాఖన్, ఫిజికల్ డైరెక్టర్లు బీరయ్య ,శివకృష్ణ, అనుప్ రెడ్డి, మల్లయ్య, ఎంర్రికాయల శ్రీనివాస్, సీఆర్పీ చందు తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో హైబ్రిడ్ (ఏటీఎం)లను ప్రవేశపెట్టనున్న కేంద్రం.

**రాయికోడ్ మండలం, ప్రతినిధి, ఫిబ్రవరి 03 నేషనలిస్ట్ వాయిస్:**

అందుబాటులో రూ.10, రూ.20, రూ.50 నోట్లు పెద్ద నోట్లు డిపాజిట్ చేస్తే, చిన్న నోట్లతో పాటు, నాణేలు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం డిమాండ్ తీర్చడానికి చిన్న కరెన్సీ ముద్రణను, మరింత పెంచాలని (ఆర్బిఐ)ని కోరనున్న కేంద్రం.




## పోలింగ్ కేంద్రాలు,కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించిన

### మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్, ఐఏఎస్

**కేసముద్రం ఫిబ్రవరి 03 నేషనలిస్ట్ వాయిస్:**

జిల్లా వ్యాప్తంగా (5) మున్సిపల్ పరిధిలోని మహబూబాబాద్, కేసముద్రం,తొర్రూరు, డోర్నకల్,మరిపెడలలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియన ఏర్పాట్లను మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, సెంట్ అగస్టిన్ హై స్కూల్ కౌంటింగ్ కేంద్రంను పరిశీలించారు,ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అధికారులు పక్కాగా సౌకర్యాలను కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం ముగిసే వరకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు త్రాగునీరు,చైర్స్,టెంట్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య బృందం ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు, పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలించే క్రమంలో రిటర్నింగ్ అధికారులు పోలీస్ భద్రతా సిబ్బంది మధ్య పోలింగ్ బాక్సులు తరలించాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార ముందస్తు అనుమతులు,ఖర్చుల వివరాలు,తదితర అనుమతులను సమయం లోగా తీసుకునే విధంగా అభ్యర్థులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు,మరిపెడ కేంద్రంలోనీ సెంట్ ఆగస్టీన్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు, జనరల్ అబ్జర్వర్ వెంట నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, స్థానిక మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది కృష్ణ ప్రసాద్, ప్రవీణ్ ఉన్నారు.



## టీఆర్జిపిఏ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింలు రోడ్డు ప్రమాదంలో మృతి..

### లారీ వెనకనుండి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి..

**గజ్వేల్, ఫిబ్రవరి 03, నేషనలిస్ట్ వాయిస్:**




గజ్వేల్ నియోజకవర్గం దుద్దెడ గ్రామానికి చెందిన టీఆర్జిపిఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింలు మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం గజ్వేల్ లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నర్సింలు నీ వెనకాల నుండి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై గజ్వేల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుకోని సంఘటనలో నర్సింలు మృతి చెందడంతో కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

# ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

### -- సర్పంచ్ తులా మనోహర్ రావు

**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 03, నేషనలిస్ట్ వాయిస్ :**

మానవాళి మనుగడలో పశువులు సమృద్ధి అవసరమని సర్పంచ్ తులా మనోహర్ రావు అన్నారు. మొట్లపల్లి లోని ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం 2025 -2026 సంవత్సరంలో భాగంగా ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తుల మనోహర్ రావు రిబ్బన్ కట్టింగ్ చేసి ప్రారంభించారు. నిపుణులైన అధ్యాపక బృందం, నిష్ణాతులైన పశువైద్యులు, వైద్య విద్యార్థులుతో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల కాపరులకు ఉచిత మందులు పంపిణీ చేశారు, పశువులకు గర్భ కోశా వ్యాధి నివారణ చికిత్సలు, దూడలకు నట్టలు నివారణ మందులు పంపిణి, పశు పోషణ సంరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు రోజుల క్రితం గొర్రె గర్భంలో చనిపోయిన మృత గొర్రె పిల్లను సర్జరీ చేసి గొర్రెను ప్రాణాలతో కాపాడిన వైద్య బృందం. వైద్య బృందానికి సర్పంచ్, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద రాతుపల్లి పశువైద్యాధికారి డాక్టర్ శైలజ, పశువైద్య డాక్టర్లు ప్రతీప్ రెడ్డి, దీపిక,నీరజ, ప్రణయ్, పండిత్ రెడ్డి, గొర్రెల మేకల సొసైటీ అధ్యక్షులు మేకల మల్లేష్ యాదవ్, తదితర డాక్టర్లు పాల్గొన్నారు.



# రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం పార్టీకి కో అప్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

### నామినేషన్లు ఉపశమహరించుకున్న సిపిఎం అభ్యర్థులు

**గోదావరిఖని ఫిబ్రవరి 03 నేషనలిస్ట్ వాయిస్**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో ఈ నెల 11న జరుగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం నుండి 32,35,36,37 డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులుగా నామినేషన్ వేయడం జరిగింది. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు సిపిఎం నాయకత్వంతో ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో చర్చించడం జరిగింది. మీరు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల నుండి నా గెలుపుకోసం, మా పార్టీ గెలుపుకోసం పనిచేసారు. మన మధ్య స్నేహం కొనసాగుతుంది. మీరు చేసిన సహాయం పార్టీ ఎప్పుడూ మర్చిపోను, నేను చేస్తున్న అభివృద్ధిలో మీరు కూడా భాగస్వామ్యం కావాలని కోరుతున్నాను. మీరు అందిస్తున్న సహకారానికి సిపిఎం పార్టీ కి కో అప్షన్ ఇస్తామని హామీయిస్తూ, 59 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు సహకరించాలని కోరడం జరిగింది. దింతో వెంటనే సిపిఎం జిల్లా నాయకత్వం చర్చించి కో అప్షన్ కు అంగీకరించి, 37వ డివిజన్ లో స్నేహ పూర్వక పోటీలో ఉంటామని, మిగిలిన మూడు నామినేషన్లు ఉపశమహరించుకుంటామని ఎమ్మెల్యే గారికి చెప్పడంతో సిపిఎం పెట్టిన ప్రతిపాదనను ఎమ్మెల్యే గారు అంగీకరించడం జరిగింది. దింతో 32,35,36 డివిజన్ల నామినేషన్లు ఉపశమహరించుకోవడం జరిగింది.



# ప్రజావాణి కార్యక్రమం లో ఫిర్యాదులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ: శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపిఎస్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నేషనలిస్ట్ వాయిస్ న్యూస్**

జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఎస్పీ సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేసి న్యాయసమ్మతంగా పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని, ప్రతి పిర్యాదుపై నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు తెలిపారు. అనంతరం ఎస్పీమాట్లాడుతూ, జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరైనా తమ సమస్యలను భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. చట్ట పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే పోలీస్ శాఖ యొక్క బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, దీనివల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఎస్పీ తెలిపారు.




# జోరుగా సాగుతున్న బిజెపి అభ్యర్థి గణపురం చంద్రశేఖర్ ప్రచారం

**సదాశివపేట టౌన్ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి 3-3-26 మంగళవారం**

సదాశివపేట పట్టణంలోని పదవ వార్డులో దీజీ అభ్యర్థి ప్రజలు నమ్మిన నాయకుడు గణపురం చంద్రశేఖర్ 10వ వార్డు లోని ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని 10వ వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తాననిఅన్నారు ఇంతకుముందున్న నాయకులు 10వ వార్డు అభివృద్ధి గురించి పట్టించుకోవడం కానీ సమస్యలు తెలుసుకోవడం కానీ ఎవరు చేయలేరు అని ప్రజలు అన్నారని అలాగే కొత్త నాయకులకు కూడా ఒకసారి అవకాశం ఇస్తే ఖచ్చితంగా వార్డులు అభివృద్ధి అయితదని ప్రజలు నమ్మకంతో బిజెపి అభ్యర్థి గణపురం చంద్రశేఖర్ గారికి వివరించారు 10వ వార్డ్ అభివృద్ధి కావాలంటే బిజెపి కమలం పువ్వు గుర్తుకే ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఘనాపురం చంద్రశేఖర్ గారు కోరారు ప్రపంచ దేశాలే మన మోడీ నాయకత్వం గురించి తెలుసుకొని వారి పాలనలో నడుస్తున్నాయని ప్రజలకు వివరించడం జరిగింది పదో వార్డులో అభివృద్ధి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని వార్డులకు మున్సిపాలిటీలకు నిధులు రావాలన్న అభివృద్ధి కావాలన్నా బిజెపితోనే సాధ్యమని అందుకే తమ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపిస్తారని నమ్ముతున్నాను



# సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు చేనేత మొగ్గం సందర్శన

**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 03, నేషనలిస్ట్ వాయిస్ :**

కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని చేనేత కార్మికులు గోలి రమణయ్య ఆధ్వర్యంలో నడుస్తున్న చేనేత మొగ్గాన్ని విద్యా విహారయాత్రగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేతిపనితో వస్త్రాలు ఎలా తయారు చేయబడుతాయో ప్రత్యక్షంగా చేసి చూపారు . హ్యాండ్లూమ్‌పై కార్మికులు ఎంతో నైపుణ్యంతో, శ్రమతో పనిచేసే విధానాన్ని వారు ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా సన్‌షైన్ స్కూల్, పెగడపల్లి పనిచేస్తూ, తరగతి గదుల్లో పాఠ్యాంశాలతో పాటు ఇలాంటి ప్రాయోగిక, అనుభవాత్మక విద్యా కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యత ఇస్తోంది. ఇటువంటి విద్యా విహారయాత్రల ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వం, సమాజంపై అవగాహన పెంపొందించడమే కాకుండా వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతోంది. ఈ సందర్శన సందర్భంగా విద్యార్థులు అక్కడ పనిచేసే చేనేత కార్మికులతో మాట్లాడి, వారి దైనందిన జీవితం, కష్టాలు మరియు శ్రమ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన ద్వారా చేనేత పరిశ్రమ ప్రాధాన్యతను, భారతదేశ సంప్రదాయ కళల విలువను విద్యార్థులు మరింతగా అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ నసీర్ విద్యార్థులతో మాట్లాడుతూ, చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ హ్యాండ్లూమ్ వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలా చేయడం ద్వారా మన సంప్రదాయాలను కాపాడడంతో పాటు అనేక కుటుంబాల జీవనోపాధికి సహకరించినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా పర్యటన విద్యార్థులకు జ్ఞానవంతంగా, ప్రేరణాత్మకంగా ఉండి వారి సర్వతోముఖ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది. ఈ పర్యటనలో గోలి శ్రీకాంత్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# 'హనీ' ట్రైలర్ లాంచ్‌లో దివి వాద్య కామెంట్స్ వైరల్...

## బెదిరిస్తారు, ఆ తర్వాత మామిడికాయలు ఇస్తారు...

బుల్లితెరపై ప్రసారమైన పాపులర్ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 4 ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న తెలుగు నటి దివి వాద్య. బిగ్ బాస్ షో అనంతరం వరుస సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. తాజాగా ఆమె కీలక పాత్రలో నటించిన తెలుగు హారర్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం 'హనీ' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పలాస ఫేమ్ దర్శకుడు కరుణ కుమార్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో నవీన్ చంద్ర, నటి దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటుడు రాజా రవీంద్ర కూడా ముఖ్య పాత్ర పోషించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దివి వాద్య చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈవెంట్‌లో మాట్లాడిన దివి మొదట దర్శకుడు కరుణ కుమార్‌తో పని చేయాలనే తన కోరికను వ్యక్తపరుస్తూ, పలాస సినిమా సమయంలో కలిసినా అప్పట్లో అవకాశం రాలేదని, ఈ కథ వినగానే చాలా ఎగ్జైటెడ్‌గా ఫీలయ్యానని తెలిపింది. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై, రాజా రవీంద్ర వంటి అనుభవజ్ఞులైన నటులతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని, ఈ సినిమా ప్రేక్షకులను వెంటాడే విధంగా ఉంటుందని, అందరూ ఫిబ్రవరి 6న థియేటర్లకు వెళ్లి చూడాలని కోరింది. అనంతరం మీడియా ప్రతినిధులు ఆమె పాత్ర గురించి ప్రశ్నించగా, ట్రైలర్‌లో కనిపిస్తున్నట్లు తన క్యారెక్టర్‌లో డార్క్ షేడ్స్ ఉంటాయని సింపుల్‌గా సమాధానం ఇచ్చింది. అయితే ఆమె అలా చెప్పగానే పక్కనే ఉన్న రాజా రవీంద్ర "ఏయ్" అంటూ సరదాగా వారించడం అక్కడ నవ్వులు పూయించింది.దానికి స్పందించిన దివి "చెప్పొద్దా?" అంటూ సరదాగా ప్రశ్నించగా, రాజా రవీంద్ర నిశ్శబ్దంగా ఉండిపోయాడు. వెంటనే దివి "ఇలా అందరి ముందు బెదిరిస్తారు... ఎవరు లేనప్పుడు మాత్రం మామిడి కాయలు ఇస్తారు" అని చమత్కరించడంతో హాల్ మొత్తం నవ్వులతో మార్మోగింది. దాంతో రాజా రవీంద్ర షూటింగ్ సమ్మర్‌లో జరిగిన విషయమని వివరణ ఇచ్చాడు. రిపోర్టర్లు మామిడి కాయల విషయంపై అడగగా, సెట్స్‌లో రాజా రవీంద్ర గారి హాస్పిటాలిటీ చాలా బాగుండేదని, అదే ఉద్దేశంతో అలా అన్నానని దివి క్లారిటీ ఇచ్చింది. అనంతరం తన పాత్రపై మాట్లాడుతూ, సినిమాలో తన డార్క్ సైడ్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని, ఇలాంటి నెగెటివ్ లేదా డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలు భవిష్యత్తులో మరింత వస్తాయని ఆశిస్తున్నానని చెప్పింది. దర్శకుడు కరుణ కుమార్ తన నుంచి అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తీసుకున్నారని, తానేనా ఇలా చేశానని అనిపించేలా పని చేయించారని పేర్కొంది. మొత్తానికి 'హనీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దివి వాద్య చేసిన సరదా వ్యాఖ్యలు, రాజా రవీంద్రతో జరిగిన ఫన్నీ మోమెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

# మరో మాస్ కాంబోకి సిద్ధమైన బాలయ్య


## ..మలయాళ దర్శకుడితో భారీ సినిమా

నట సింహం, గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ అంటే పవర్‌ఫుల్ పాత్రలు, మాస్ డైలాగులు, హై వోల్టేజ్ యాక్షన్ సీన్స్ గుర్తుకొస్తాయి. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకు మహరాజ్' వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలు అందుకున్న బాలయ్య... ఇటీవల విడుదలైన 'అఖండ 2' విషయంలో మాత్రం అభిమానులను కొంత నిరాశపరిచారనే టాక్ వినిపించింది. కథ పరంగా అంచనాలు అందుకోలేకపోయినా, ఈ చిత్రం రూ.100 కోట్ల మార్క్ దాటి బాలకృష్ణ స్టార్ పవర్ మరోసారి నిరూపించుకుంది.ప్రస్తుతం బాలకృష్ణ దర్శకుడు గోపీచంద్ మలినేనితో ఓ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం... ఈ ప్రాజెక్ట్‌కు మొదట అనుకున్న కథను పక్కనపెట్టి, మరింత పవర్‌ఫుల్ మరియు కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన కొత్త కథతో ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బాలయ్య ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఎలివేషన్ సీన్స్ ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయని తెలుస్తోంది. ఇదే సమయంలో టాలీవుడ్‌లో మరో ఆసక్తికర వార్త హల్‌చల్ చేస్తోంది. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన స్టైలిష్ యాక్షన్ దర్శకుడు హనీఫ్ అదెనితో బాలకృష్ణ ఓ భారీ చిత్రం చేయబోతున్నారనే ప్రచారం జోరందుకుంది.ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మించనున్నారని, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా... ఈ కాంబినేషన్ వార్తలతోనే బాలయ్య అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. హనీఫ్ అదెని పేరు వినగానే స్టైలిష్ యాక్షన్, రా ఎనర్జీ, ఇంటెన్స్ విజువల్స్ గుర్తుకొస్తాయి. ఆయన సినిమాల్లో కథకన్నా ప్రెజెంటేషన్, స్క్రీన్‌పై కనిపించే ఎమోషనల్ హై మరియు యాక్షన్ ఇంపాక్ట్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇటీవల విడుదలైన 'మార్కో' సినిమాతో దక్షిణాది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన హనీఫ్... హింసాత్మక సన్నివేశాలపై విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, టార్గెటెడ్ మాస్ ఆడియెన్స్‌ను బాగా మెప్పించారు. ఇలాంటి టేకింగ్ స్టైల్ బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు మరింత బలాన్నిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ వార్తలపై క్లారిటీ రావాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సిందే.



# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్

గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్ధానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.



# పాప్ దిగ్గజం బయోపిక్.. 'మైఖేల్' ట్రైలర్ విడుదల

పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'మైఖేల్' . ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన సొంత మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషిస్తుండటం విశేషం. ట్రైలర్‌లో జాఫర్ తన నటన, డ్యాన్స్ మూమెంట్స్ మరియు బాడీ లాంగ్వేజ్‌తో అచ్చం మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, మైఖేల్ జాక్సన్ చిన్నతనం నుంచి గ్లోబల్ సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లను తండ్రి జో జాక్సన్‌తో ఉన్న సంక్లిష్ట సంబంధాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కోల్మన్ డొమింగో, నియా లాంగ్ మైఖేల్ తల్లిదండ్రులుగా నటించగా, మైల్స్ టెల్లర్ కీలకమైన మేనేజర్ పాత్రలో కనిపించనున్నారు.




# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

## రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు

బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృద్వి రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు- ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆర్ఆర్ఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్ట్రిబ్యూషన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.




# దురంధర్-2 షూట్‌లో డ్రోన్ వినియోగం

## నిషేధిత ప్రాంతం కావడంతో పోలీస్ కేసు

ముంబైలోని హై-సెక్యూరిటీ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ కెమెరాను ఉపయోగించినందుకు గాను బాలీవుడ్ మూవీ 'ధురంధర్ 2' చిత్ర బృందంపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. దక్షిణ ముంబైలోని పోర్ట్ ప్రాంతంలో ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా డ్రోన్‌ను వినియోగించినందుకు చిత్ర లొకేషన్ మేనేజర్ రింకూ రాజ్‌పాల్ వాల్మీకిపై పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు సమాచారం.గత మూడు రోజులుగా ముంబై ఫోర్ట్ ప్రాంతంలో 'ధురంధర్ 2' షూటింగ్ కొనసాగుతుండగా, చిత్ర బృందం ఈ చారిత్రాత్మక ఫోర్ట్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లోని ఒక పాత వీధిని తలపించేలా సెట్ వేసింది. ఫిబ్రవరి 1న జరిగిన షూటింగ్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే నిబంధనలకు విరుద్ధంగా గాలిలోకి డ్రోన్‌ను ఎగురవేయడం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ముంబైలోని పోర్ట్ ప్రాంతం ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలకు కేంద్రం కావడంతో ఇక్కడ భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై కఠినమైన ఆంక్షలు అమలులో ఉన్నాయి. అలాగే డ్రోన్ ఎగురవేయడానికి ముందు తీసుకోవాల్సిన తప్పనిసరి అనుమతులను చిత్ర యూనిట్ తీసుకోలేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు లొకేషన్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఎవరినీ అరెస్టు చేయనప్పటికీ, భద్రతా నిబంధనల ఉల్లంఘనపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు. హై-సెక్యూరిటీ జోన్లలో షూటింగ్ జరుపుకునేటప్పుడు చట్టపరమైన అనుమతులు కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656